చదువు

ఈనాడు హైదరాబాద్ సోమవారం జనవరి 22, 2018 ■ e-mail: edc@eenadu.in



**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఎనిమిది వేలకు పైగా ఖాళీలతో క్లరికల్ (జూనియర్ అసోసియేట్స్) నోటిఫికేషన్ వెలువడింది. వీటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 400, తెలంగాణలో 255 ఖాళీలు భర్తీ చేయనున్నారు. సాధారణ డిగ్రీ అర్హతతో దేశంలోనే అతిపెద్ద బ్యాంకులో ఉద్యోగం సాధించుకునే మంచి అవకాశం ఇది. అకడమిక్ పరిజ్ఞానంతో సంబంధం లేకుండా సరైన ప్రణాళికతో ప్రాక్టీస్ చేస్తే ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు.**



# అతిపెద్ద బ్యాంకులో కోరుకున్న కొలువు!



దేశ వాణిజ్య బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ ప్రథమస్థానంలో ఉండటమే కాకుండా, ప్రపంచంలోని మొదటి 100 బ్యాంకుల్లో ఒకటిగా ఉంది. ఇతర బ్యాంకులతో పోలిస్తే జీతభత్యాలు కూడా ఇందులో ఎక్కువే. అన్ని బ్యాంకుల కంటే ఎక్కువగా 18 వేలకు పైగా బ్రాంచ్‌లు కలిగి ఉండటం వల్ల తమ ప్రాంతాలకు దగ్గరగా పనిచేసే అవకాశం కూడా అభ్యర్థులకు లభిస్తుంది. ఈ ప్రత్యేకతల వల్ల సహజంగా అభ్యర్థులు ఎస్‌బీఐ నోటిఫికేషన్ పట్ల అత్యంత ఆసక్తిగా ఉంటారు. అందుకే పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది.

## ప్రిలిమినరీ పరీక్షలో ప్రధాన మార్పు

2016లో విడుదలైన నోటిఫికేషన్‌తో పోలిస్తే ఒకే తరహాలో రెండంచెల రాత పరీక్ష ఉంది. సబ్జెక్టులు, ప్రశ్నల సంఖ్య, పరీక్షకు కేటాయించిన మొత్తం సమయంలో ఎలాంటి మార్పు లేదు. అయితే ప్రిలిమినరీ పరీక్షలో మాత్రం మొదటిసారిగా

> మొత్తం ఖాళీలు: 8301
> దరఖాస్తు ప్రారంభం: జనవరి 20, 2018 (ఆన్‌లైన్‌లో)
> చివరి తేదీ: ఫిబ్రవరి 10, 2018

మొత్తం 60 నిమిషాల సమయాన్ని విభాగాల వారీగా 20 నిమిషాల చొప్పున మూడు విభాగాలకు కేటాయించారు. దీని వల్ల అభ్యర్థులు ఏదైనా విభాగాన్ని మొదలుపెడితే, దానికి నిర్దేశించిన సమయం పూర్తయిన తర్వాతే మరొక విభాగంలోకి వెళ్లాల్సి ఉంటుంది. కొన్ని ప్రశ్నల తర్వాత వేరే విభాగంలోకి వెళ్లే అవకాశం ఉండదు. దీనివల్ల తేలికగా ఉండే విభాగాన్ని త్వరగా పూర్తిచేసి తద్వారా మిగిలిన సమయాన్ని ఇతర కఠిన సబ్జెక్టులోని ప్రశ్నలు సాధించడానికి ఉపయోగించుకునే వెసులుబాటు ఈ పరీక్షలో ఉండదు.

## న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్‌లు కీలకం

ప్రిలిమినరీ పరీక్షలో సమయాన్ని విభాగాలవారీగా కేటాయించడం వల్ల న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో ఉండే 35 ప్రశ్నలను 20 నిమిషాల్లో పూర్తి చేయాలి. అంటే ఒక్కో ప్రశ్నకు సగటున 34 సెకన్ల సమయం మాత్రమే ఉంటుంది. ఇది అత్యంత తక్కువ సమయం. అందువల్ల ఈ రెండు విభాగాలను ఎవరైతే వేగంగా పూర్తిచేయగలుగుతారో వారే మిగిలిన అభ్యర్థుల కంటే మెరుగైన ప్రతిభను ప్రదర్శించగలుగుతారు.

## అయిదు సబ్జెక్టులూ ముఖ్యమే!

ప్రాథమిక, ప్రధాన పరీక్షలు రెండింటిలో ఉండే అయిదు సబ్జెక్టులన్నీ వేటికవే ముఖ్యమైనవి.

**క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ:** ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు రెండింటిలో ఉండే విభాగమిది. న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లోని ప్రధాన భేదం ప్రశ్నల స్థాయి. సిలబస్‌లో పెద్దగా తేడా లేకపోయినా వాటికి సంబంధించిన ప్రశ్నల స్థాయి న్యూమరికల్ ఎబిలిటీలో తక్కువగా, క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేట్ వాల్యూస్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, అరిథ్‌మెటిక్‌లోని వివిధ టాపిక్స్ నుంచి ప్రశ్నలుంటాయి. అయితే న్యూమరికల్ ఎబిలిటీలో సింప్లిఫికేషన్స్ నుంచి, క్వాంటిటేటివ్ ఎబిలిటీలో డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ సమయం పట్టే విభాగం కాబట్టి లెక్కలు వేగంగా చేయగలిగే విధంగా బాగా సాధన చేయాలి. నంబర్ సిరీస్ ప్రశ్నల్లో సంఖ్యల మధ్య సంబంధం వెంటనే స్ఫురిస్తే ఆ ప్రశ్నను సాధించాలి. లేకపోతే ఎక్కువ కాలయాపన చేయకుండా వాటిని వదిలేయాలి. అదే విధంగా కఠినంగా అనిపించే ప్రశ్నలపై కూడా ఎక్కువ కాలయాపన మంచిది కాదు. తేలికపాటి ప్రశ్నలు ముందుగా పూర్తిచేసి సమయం ఉంటే కఠినమైన ప్రశ్నలు ప్రయత్నించాలి.

**జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్:** సాధారణంగా జనరల్ అవేర్‌నెస్‌గా పేర్కొనే ఈ విభాగాన్ని ఈ పరీక్షలో జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్ అంటారు. జనరల్ అవేర్‌నెస్‌గా వ్యవహరించినప్పుడు కూడా ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించిన విషయాలపైనే ఎక్కువ ప్రశ్నలు ఉండేవి. అందువల్ల ఇప్పుడు జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌గా ఇవ్వడం వల్ల సబ్జెక్టు కొత్తగా మారిందేమీ లేదు.



డా. జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, RACE

ఈ విభాగంలో ప్రశ్నలు సాధారణంగా ఎకానమీ, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించిన వర్తమానాంశాలపై ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సాధారణ బడ్జెట్‌లపై ప్రశ్నలు వస్తాయి. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, అవార్డులు, పుస్తకాలు-రచయితలు, వార్తల్లోని వ్యక్తులు, స్థలాలు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ మొదలైన వాటి నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన రోజులు గుర్తుంచుకోవాలి. సాధారణంగా పరీక్షా సమయానికి 5, 6 నెలల ముందు వరకు ఉండే వర్తమానాంశాలపైనే ఎక్కువ ప్రశ్నలు వస్తుంటాయి.

అదేవిధంగా బ్యాంకింగ్ టెర్మినాలజీ తెలుసుకోవాలి. వివిధ బ్యాంకులు, వాటి ట్యాగ్‌లైన్/క్యాప్షన్లు గుర్తుపెట్టుకోవాలి. ఈ విభాగంలో ప్రశ్నలు వచ్చే అంశాల ప్రాధాన్యాన్ని తెలుసుకొని సన్నద్ధమైతే ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

**రీజనింగ్:** అకడమిక్ పరీక్షల్లో ఎప్పుడూ చదవనిదీ, ఆసక్తికరంగా, సులభంగా ఉండేది రీజనింగ్. ఈమధ్య పరీక్షల్లో ఈ విభాగం ప్రశ్నలు కాస్త కఠినంగా ఉంటున్నాయి. కాబట్టి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. దీనిలో కోడింగ్-డీకోడింగ్, అల్ఫాబెట్-నంబర్ సిరీస్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, వెన్ డయాగ్రమ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజమ్ మొదలైన వాటితోపాటు అనలిటికల్ రీజనింగ్‌లోని స్టేట్‌మెంట్ సంబంధ ప్రశ్నలు, కాజ్-ఎఫెక్ట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్, పజిల్ టెస్ట్, ఎలిజిబిలిటీ టెస్ట్ మొదలైన వాటి నుంచి సాధారణంగా ప్రశ్నలు ఉంటాయి. బాగా సాధన చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా సరైన జవాబు గుర్తించవచ్చు.

**ఇంగ్లిష్ లాంగ్వేజ్:** బ్యాంకు పరీక్షల్లో ఎక్కువమంది ఫెయిలయ్యే విభాగమిది. దీనికి సరైన ప్రాధాన్యం ఇచ్చి తగిన విధంగా సిద్ధం కాకపోవడమే ప్రధాన కారణం. అయితే ఈ విభాగంలో వస్తున్న ప్రశ్నల సరళిని గమనించి తదనుగుణంగా ప్రిపేర్ అయితే ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు. దీనిలో గ్రామర్ ఆధారంగా ఉండే సెంటెన్స్ కంప్లిషన్, పేరా జంబుల్డ్, ఫిల్లర్స్, క్లోజ్ టెస్ట్, గ్రమెటికల్ ఎర్రర్స్, రీ-అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్ మొదలైన వాటి నుంచే దాదాపు 40-50 ప్రశ్నలుంటాయి. ఈ తరహా ప్రశ్నలు బాగా సాధన చేయాలి. వీటితోపాటు కాంప్రహెన్షన్, ఒకాబ్యులరీ ప్రశ్నలుంటాయి. వేగంగా చదవడం ప్రాక్టీస్ చేస్తే కాంప్రహెన్షన్‌లో ప్రశ్నలు త్వరగా సాధించవచ్చు.

**కంప్యూటర్ నాలెడ్జ్:** అభ్యర్థులందరూ ఎక్కువ మార్కులు సాధించగలిగే సబ్జెక్ట్ ఇది. ఎవల్యూషన్ ఆఫ్ కంప్యూటర్, బేసిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, వివిధ కాంపోనెంట్స్, డివైజెస్-వాటి ఉపయోగాలు, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఎమ్మెస్ ఆఫీస్, నెట్ వర్కింగ్, ఇంటర్నెట్, ఇ-కామర్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, డీబీఎంఎస్, కంప్యూటర్ రంగంలోని తాజా పరిణామాలు తదితరాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

### పరీక్ష విధానం

**ప్రిలిమ్స్**

| సబ్జెక్టు | మార్కులు | ప్రశ్నలు |
|---|---|---|
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 30 | 30 |
| న్యూమరికల్ ఎబిలిటీ | 35 | 35 |
| రీజనింగ్ ఎబిలిటీ | 35 | 35 |
| మొత్తం | 100 | 100 |

★ ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం కాలవ్యవధి ఒక గంట.

**మెయిన్స్**

| సబ్జెక్టు | ప్రశ్నల సంఖ్య | మార్కులు | కాలవ్యవధి (నిమిషాల్లో) |
|---|---|---|---|
| జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ | 50 | 50 | 35 |
| జనరల్ ఇంగ్లిష్ | 40 | 40 | 35 |
| క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ అండ్ | 50 | 50 | 45 |
| కంప్యూటర్ ఆప్టిట్యూడ్ | 50 | 60 | 45 |
| మొత్తం | 190 | 200 | 160 |

### తరచూ తలెత్తే ప్రశ్నలు

**■ నేను నాన్-మ్యాథ్స్ అభ్యర్థిని. బ్యాంక్ ఉద్యోగం సాధించగలనా?**

జ: బ్యాంక్ పరీక్షలు పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. అదేవిధంగా వీటిలోని సబ్జెక్టులన్నీ జనరల్ సబ్జెక్టులు. కేవలం అరిథ్‌మెటిక్ మాత్రమే ఇంతకు ముందు చదివి ఉంటారు. అది కూడా పాఠశాల స్థాయిలోనిదే. అందువల్ల ఆర్ట్స్, కామర్స్, సైన్స్, మేథ్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ మొదలైన ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చినా అందరూ బ్యాంక్ ఉద్యోగం సాధించుకోవచ్చు.

**■ బ్యాంక్ పరీక్షకు ఉన్న ఈ రెండు నెలల సమయం సరిపోతుందా?**

జ: పరీక్షలో ఉండే విభాగాలన్నింటి కాన్సెప్ట్స్ నేర్చుకోవడానికి నెలరోజులు సరిపోతాయి. మిగిలిన సమయం వివిధ రకాల ప్రశ్నలు, మాదిరి ప్రశ్నపత్రాలు సాధించడానికి ఉపయోగిస్తే సమయం సరిపోతుంది.

**■ రోజూ ప్రిపరేషన్ కోసం ఎన్ని గంటలు కేటాయించాలి?**

జ: ఇక్కడ ఎన్ని గంటల సమయం అని కాకుండా ఎంత క్వాలిటీ సమయం కేటాయించారనేది ముఖ్యం. సబ్జెక్టులన్నింటికీ రెండు నెలల సమయంలో సిద్ధం కావాలంటే రోజుకి 8 నుంచి 10 గంటల సమయం కేటాయించాలి.

**■ తెలుగు మాధ్యమం అభ్యర్థులు ఈ ఉద్యోగం సాధించగలరా? ఇంగ్లిష్ మీడియం వారితో పోటీ పడగలరా?**

జ: పరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది కాబట్టి తెలుగు మీడియం అభ్యర్థులు సబ్జెక్టులన్నీ ఇంగ్లిష్‌లోనే నేర్చుకోవాలి. తెలుగులో నేర్చుకున్న పదాలన్నింటికీ ముందుగా ఇంగ్లిష్ పదాలు తెలుసుకోవాలి. ఇంగ్లిష్‌లోనే చదువుతూ ప్రాక్టీస్ చేస్తారు కాబట్టి అలవాటు పడతారు. అయితే ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులతో పోలిస్తే ఎక్కువ సమయం కేటాయించుకోవడం మంచిది. సబ్జెక్టులన్నీ అందరికీ ఒకటే కాబట్టి ఎవరు బాగా సాధన చేస్తే వారికే అవకాశం ఉంటుంది.

**■ పరీక్షలో ఏ సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి?**

జ: బ్యాంక్ పరీక్షలోని అన్ని సబ్జెక్టుల్లో విడివిడిగా ఉత్తీర్ణులవ్వాలి. కాబట్టి సబ్జెక్టులన్నింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి.

## సన్నద్ధత ఏ విధంగా?

ప్రిలిమ్స్ పరీక్ష మార్చి/ఏప్రిల్‌లో, మెయిన్స్ పరీక్ష మే 12న జరుగుతాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఒకే సబ్జెక్టులు ఉన్నాయి కాబట్టి అభ్యర్థులు వీటికి విడివిడిగా కాకుండా ఒకేసారి ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతూ దాని అధ్యయనాన్ని ప్రిలిమ్స్ జరిగేలోగా పూర్తిచేయాలి. కనీసం ప్రిలిమ్స్‌లో కామన్‌గా ఉండే మూడు సబ్జెక్టులనైనా చదివేయాలి. కొత్తగా పరీక్ష రాసే సబ్జెక్టుల్లోని టాపిక్‌లను ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించాలి. ఆపై వివిధ స్థాయుల్లోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా వీలైనన్ని పూర్తిస్థాయి మోడల్ పేపర్లను సమయం నిర్దేశించుకుని సాధన చేయాలి. ఎప్పటికప్పుడు సాధించగలిగే ప్రశ్నల సంఖ్య పెరిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

**మరిన్ని వివరాలు, స్టడీమెటీరియల్, ఆన్‌లైన్ పరీక్షలు, ప్రీవియస్, మోడల్ పేపర్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్**
పోస్టు: కన్సల్టెంట్
ఖాళీలు: 01
అర్హత: డిగ్రీ/ పీజీ. 20 సంవత్సరాల అనుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేది: 27.02.2018
దరఖాస్తు: ఆన్‌లైన్ చివరితేది: 15.02.2018
వెబ్‌సైట్: http://www.nird.org.in/

**ఐఐఐటీ, చిత్తూరు**
పోస్టు: సీనియర్ మేనేజర్ - స్టూడెంట్ అఫైర్స్ ఖాళీలు: 01
అర్హత: డిగ్రీతోపాటు హెచ్ఆర్ లేదా జనరల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ.
ఎంపిక: రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ దరఖాస్తు: రెజ్యూమేను ఈమెయిల్ చేయాలి.
చివరితేది: 31.01.2018
ఈమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: http://www.iiits.ac.in/

### ప్రవేశాలు

**ఐఐటీ, ఖరగ్‌పూర్**
1) ఎల్‌ఎల్‌బీ (మూడేళ్లు)
అర్హత: డిగ్రీ/ పీజీ.
2) ఎల్ఎల్ఎం (రెండేళ్లు)
అర్హత: డిగ్రీ, ఎల్ఎల్‌బీ/ బీఎల్.
ఎంపిక: ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ద్వారా
ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష తేది: 29.04.2018
దరఖాస్తు: ఆన్‌లైన్ ఫీజు: రూ.2500
చివరితేది: 28.03.2018
వెబ్‌సైట్: http://www.iitkgp.ac.in/

**ఎంఎంఎం యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, గోరఖ్‌పూర్**
కోర్సులు: బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ ఫిజిక్స్ (ఎలక్ట్రానిక్స్), ఎంటెక్, పీహెచ్‌డీ.
అర్హత: ఇంటర్/ డిగ్రీ/ బీఈ/ బీటెక్/ ఎంటెక్/ పీజీ ఉత్తీర్ణత.
ఎంపిక: మాలవీయ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎంఈటీ) - 2018 ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
ఫీజు: రూ.1500 చివరితేది: 31.03.2018
https://www.onlinemmmut.in/

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్**
పోస్టు: రెసిడెంట్ ఇంజినీర్/ డ్రాఫ్ట్స్‌మన్
ఖాళీలు: 02 అర్హత: సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ/ డిప్లొమా.
ఎంపిక: ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్
ఇంటర్వ్యూ తేది: 27.01.2018
వేదిక: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్, సీఎంఆర్ఎల్ డిపో, చెన్నై.
http://chennaimetrorail.org/

**స్విమ్స్, తిరుపతి**
పోస్టు: సీనియర్ రిసెర్చ్ ఫెలో
ఖాళీలు: 01 అర్హత: ఎంఎస్సీ/ ఎంటెక్, నెట్/ గేట్.
ఇంటర్వ్యూ తేది: 27.01.2018.
వేదిక: స్విమ్స్, తిరుపతి.
వెబ్‌సైట్: http://svimstpt.ap.nic.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

# సీఏలో చూపించాడు సత్తా!

**రెండు మార్కుల తేడాతో సీపీటీలో అఖిలభారత టాప్ టెన్ ర్యాంకును కోల్పోయాడు. అది జరిగింది 2013లో. 10 మార్కుల తేడాతో సీఏ-ఇంటర్లో టాప్ 50 ర్యాంకు చేజారిపోయింది. ఇది 2014లో. నిరాశతో కుంగిపోకుండా పట్టుదలతో కృషి చేశాడు. మరో మూడేళ్లలోనే సీఏ ఫైనల్‌లో జాతీయస్థాయి నాలుగో ర్యాంకు సాధించాడు. దక్షిణభారత రీజియన్లో ఇతడే అత్యుత్తమ ర్యాంకర్! అభ్యర్థులకు ప్రేరణ కలిగించే ఫణీష్‌రెడ్డి విజయగాథ తన మాటల్లోనే తెలుసుకుందాం!**

మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్. పదో తరగతిలో ఉన్నపుడు మొట్టమొదటిసారిగా సీఏ కోర్సు గురించి విన్నాను. విజయవాడలో నేను చదివిన గౌతం పబ్లిక్ స్కూల్లో ఓ కార్యక్రమం నిర్వహించి ఈ కోర్సు గురించి వివరించారు. సమాజం గౌరవించే వృత్తుల్లో సీఏ ఒకటనీ; అవకాశాలూ, ఎదుగుదల విషయంలో ఎదురుండదనీ తెలుసుకున్నపుడు ఆసక్తి కలిగింది. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ఆర్టికల్‌షిప్ ద్వారా పొందే మూడేళ్ల ప్రాక్టికల్ అనుభవం కుతూహలాన్ని పెంచింది. దీంతో మ్యాథ్స్, సైన్స్ సంబంధిత కోర్సులు నా గమ్యం కావనుకున్నాను.

కెరియర్‌లో దూసుకెళ్లడానికి సీఏ విభిన్నమైన మార్గమనిపించింది. టెన్త్ తర్వాత ఐఐటీ శిక్షణలో చేరాలని అమ్మానాన్న, ఉపాధ్యాయులూ ఆశించారు. కానీ భిన్నంగా, మిగతా కోర్సులకంటే కష్టమని చాలామంది భావించే సీఏనే ఎంచుకున్నాను. అందుకే సీఏ పునాది పటిష్ఠంగా ఉండటం కోసం విజయవాడ శ్రీ మేధావి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపులో చేరాను. అక్కడే సీపీటీ, ఇంటర్‌లకు శిక్షణ పొందాను.

సీఏ-సీపీటీలో 91 శాతం మార్కులూ, సీఏ ఇంటర్లో 70.43 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాను. సీఏ ఇంటర్ పరీక్షల కోసం సీఏ సంస్థ అయిన ఐసీఏఐ వారి మెటీరియల్ చదివాను. కోచింగ్ సంస్థ అందించిన నోట్సు, మెటీరియల్‌ను కూడా ఉపయోగించుకున్నా. మూడు నెలల సమగ్ర రివిజన్, ఆ సమయంలో ఇంటి దగ్గర రాసిన సెల్ఫ్ టెస్టుల ఫలితంగా మంచి మార్కులు పొందాను.

### ››› చివరకు ఫైనల్..!

సీఏ-ఇంటర్ ఫలితాల ప్రకటన తర్వాత 2014 అక్టోబరులో విజయవాడలోని ఆడిట్ సంస్థ అయిన ఎం/ఎస్ ఎంఎన్‌రావు అండ్ అసోసియేట్స్, సీఏస్ దగ్గర ఆర్టికల్‌షిప్ శిక్షణలో చేరాను. నా గురువైన సీఏ తుమ్మల శివరామ మోహనరావు గారు నన్నెంతో ప్రోత్సహించారు. అత్యుత్తమ ర్యాంకు కొట్టాలనే ప్రేరణ కలిగించారు. నాకు నిర్దేశించిన ప్రతి టాస్కునూ సమర్థంగా పూర్తిచేయగలిగాను. ఆర్టికల్‌షిప్ 2017 అక్టోబర్‌లో పూర్తయింది. ఆర్టికల్‌షిప్‌లో ఉండగా.. నిబంధనల ప్రకారం ఏప్రిల్ మధ్యకాలం నుంచి అక్టోబరు వరకూ ఆరునెలల పరీక్షల ప్రిపరేషన్ సెలవు తీసుకున్నాను. ఫైనల్ పరీక్షను తర్వాతి నెల్లోనే రాశాను. తొలి ప్రయత్నంలోనే అఖిలభారత స్థాయిలో నాలుగో ర్యాంకు పొందాను.

### ››› సొంతంగా అధ్యయనం..

ఆర్టికల్‌షిప్‌లో ఉన్నప్పుడు ఏ కోచింగ్ తరగతులకూ హాజరుకాకుండా ఐసీఏఐ మెటీరియల్‌లో సాధ్యమైనన్ని సబ్జెక్టులను సొంతంగా చదవాలని నిశ్చయించుకున్నాను. సీఏ దూరవిద్యాకోర్సు కాబట్టి... తాజా అమెండ్‌మెంట్లు, కొత్త చట్టాల పరిజ్ఞానం సీఏ అర్హత వచ్చాక కూడా ఎప్పటికప్పుడు పెంచుకోవాల్సిందే. ఇలాంటివాటికి కోచింగ్ ఏముంటుంది!



ఎనిమిది సబ్జెక్టుల్లో ఐదింటి తొలివిడత అధ్యయనాన్ని ప్రిపరేషన్ సెలవులకు ముందే ముగించాను. మిగిలిన వాటిని రెండు నెలల్లో పూర్తిచేశాను. అదే సమయంలో ఇగ్నో బీకాం పరీక్షలు కూడా రాసి, మొదటి ప్రయత్నంలోనే పాసయ్యాను. అన్ని 8 సబ్జెక్టుల పునశ్చరణకు (రివిజన్) నాలుగు నెలల సమయం ఉందప్పుడు. మొదటి రివిజన్ సమయంలో తయారుచేసుకున్న షార్ట్ నోట్స్, ఫ్లో చార్టులు స్వల్పసమయంలోనే తుది రివిజన్ పూర్తవటానికి ఉపయోగపడ్డాయి.

రివిజన్ షెడ్యూల్ ప్రణాళికలో, జవాబుల మూల్యాంకనంలో, తగిన సూచనలు ఇస్తూ ముందుకునడపటంలో నా గురువు చేసిన సాయం ఎంతో ఉంది! మూడువిడతల సమగ్ర పునశ్చరణా, రెండు సెట్ల మాక్ టెస్టులూ పూర్తిచేశాను. ఆర్టికల్‌షిప్ సమయంలో రోజుకు రెండేసి గంటల చొప్పున చదివినా, ప్రిపరేషన్ సెలవుల్లో మాత్రం రోజుకు 8 నుంచి 10 గంటలపాటు సన్నద్ధమయ్యాను. మొత్తం సన్నద్ధత, రివిజన్ షెడ్యూల్ సకాలంలో సమర్థంగా పూర్తయ్యేలా ప్రణాళిక వేసుకున్నాను. ఆలిండియా ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికను అమలుచేశాను. ఆశించిన ఫలితం వస్తుందన్న ఆత్మవిశ్వాసంతో చదివాను.

> **జాతీయస్థాయి ర్యాంకర్ ఎం. ఫణీష్‌రెడ్డి**
> తల్లి: శోభారాణి తండ్రి: శ్రీనివాస్ రెడ్డి
> జన్మస్థలం: వరంగల్, తెలంగాణ.
> టెన్త్: 566/600 ఇంటర్: 978/1000
> సీఏ-సీపీటీ: 182/200 మార్కులు
> సీఏ-ఇంటర్: 493/700 మార్కులు
> సీఏ ఫైనల్: 556 మార్కులు. (నాలుగో ర్యాంకు)

సీఏ ఫైనల్ కోసం ఐసీఏఐ అకడమిక్ ఇన్‌పుట్స్ మొత్తం (**స్టడీమెటీరియల్, ప్రాక్టీస్ మాన్యువల్స్, రివిజన్ టెస్ట్ పేపర్లు, సజెస్టెడ్ ఆన్సర్స్ ఫర్ ప్రీవియస్ ఎగ్జామ్ పేపర్లు, మాక్ టెస్ట్ పేపర్లు అండ్ కాప్స్యూల్స్**) చదివాను.

సీఏగా సమాజంలో మంచి పేరు తెచ్చుకుని, ప్రాక్టీసుకు అవసరమైన అన్నిరకాల నైపుణ్యాలూ నేర్చుకోవటం నా లక్ష్యం. ఫోరెన్సిక్ ఆడిట్, జీఎస్‌టీ అండ్ బ్యాంక్ ఆడిట్స్‌లో పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సులు చేయాలని భావిస్తున్నాను.

### ››› సీఏ అభ్యర్థులకు నా సూచనలు

✦ గణనీయ ఎదుగుదల, అవకాశాలను అందించే మంచి కోర్సుల్లో సీఏ ఒకటి. నిజమైన ఆసక్తి ఉంటేనే ఈ కెరియర్‌ను ఎంచుకోండి. ✦ సీఏ కోర్సులో ఆర్టికల్‌షిప్ చాలా ప్రాముఖ్యమైంది. విద్యార్థి సీఏ ప్రొఫెషనల్‌గా మారేది ఈ దశలోనే! దీన్ని సమర్థంగా చేస్తే అది ఫైనల్ సన్నద్ధతకూ, తర్వాత వృత్తిపరంగా ఉపకరిస్తుంది. ✦ ఫైనల్ కోసం ముందస్తు ప్రణాళిక వేసుకోవాలి. ఆర్టికల్‌షిప్ సమయంలోనే వీలైనన్ని సబ్జెక్టులను చదివితే, సెలవులను సమగ్ర రివిజన్‌కు సమర్థంగా వినియోగించుకోవచ్చు. ✦ వేసుకున్న ప్రణాళికను అమలుచేయటానికి పూర్తిగా కృషి చేయాలి. ✦ అనుకున్న ర్యాంకును సాధిస్తామనే ఆత్మవిశ్వాసం చివరిదాకా నిలుపుకోవాలి.